సాక్షి
నిజామాబాద్
మంగళవారం । 1 । జూలై । 2025



రెండే గదుల్లో నాలుగు..

రెండే గదుల్లో నాలుగు తరగతులను నిర్వహిస్తున్నారా అని ప్రైమరీ స్కూల్ టీచర్లను సివిల్ జడ్జి ఉదయ్ భాస్కర్‌రావు ప్రశ్నించారు.

- 8లో ▸



అర్జీలను పరిష్కరించాలి..

ప్రజావాణిలో అందే ఫిర్యాదులను పరిశీలించి వెంటవెంటనే సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి అన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.6 /21.9

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ఎరువుల కొరత తలెత్తకుండా చూడాలి



రుద్రూర్: ఎరువులు కొరత తలెత్తకుండా చూడాలని అధికారులకు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. రూ.48లక్షల వ్యయంతో రుద్రూర్ మండల కేంద్రంలో నిర్మించిన గోదామును ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. వ్యవసాయ సహకార సంఘాలు రైతులకు అవసరమైన సేవలందించాలని సూచించారు. ప్రతి సంక్షేమ పథకంలో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని అధికారులకు సూచించారు. దశలవారీగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందుతాయని అన్నారు. కార్యక్రమంలో విండో చైర్మన్ బద్దం సంజీవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ నారోజి గంగారాం, తహసీల్దార్ తారాబాయి, ఎంపీడీవో భీమ్‌రావు, విండో మాజీ చైర్మన్ పత్తి రాము, మాజీ ఎంపీపీ సుజాత నాగేందర్, నాయకులు తోట అరుణ్ కుమార్, తోట సంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశాల గడువు పొడిగింపు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశాల గడువు పెంచినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. 2026–27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశం కోసం ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 29లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మిగతా వివరాలకు 63017 61447 నంబర్‌ను సంప్రదించాలన్నారు.


నేడు కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): మాధవనగర్ బైపాస్ సమీపంలోని ఈవీఎం గార్డెన్‌లో నేడు (మంగళవారం) నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ హాజరుకానున్నట్లు తెలిపారు. అలాగే టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, పీసీసీ ప్రధాన కార్యదర్శులు నరేశ్‌జాదవ్, నగేశ్‌రెడ్డి, పీసీసీ డెలిగేట్స్, పీసీసీ కార్యవర్గ సభ్యులు, వివిధ మార్కెట్ కమిటీల అధ్యక్షులు, డైరెక్టర్లు, అన్ని మండలాల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్ అధ్యక్షులు హాజరవుతారని ఆయన తెలిపారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో ప్రాజెక్ట్‌లోకి 1,817 క్యూసెక్కుల వరద వస్తోంది. కాకతీయ కాలువ ద్వారా 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, మిషన్ భగీరథ అవసరాలకు 231 క్యూసెక్కులు వినియోగిస్తున్నారు. ఆవిరి రూపంలో 286 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి 1064.70 (15.67 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

అడ్‌హక్ కమిటీ అధ్యక్షుడిగా బొబ్బిలి నర్సయ్య



నిజామాబాద్‌నాగారం: తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అడ్‌హక్ కమిటీని ఆదివారం ఏర్పాటు చేశారు. ఐదుగురు సభ్యులతో ఏర్పాటు చేసిన కమిటీకి ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య సారథ్యం వహించనున్నారు. ఈ మేరకు తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ముక్కిరి శృతి నియామక ఉత్తర్వులు ఇచ్చారు. ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయడానికే అడ్‌హక్ కమిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. జిల్లాలో నూతన కమిటీ ఏర్పాటయ్యే వరకు, నిజామాబాద్ జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ స్థానంలో ఈ అడ్‌హక్ కమిటీ పాలకమండలిగా పనిచేస్తుందని స్పష్టం చేశారు.

అమితంగా జోష్!

కేంద్ర హోం మంత్రి, పార్టీ అగ్రనేత అమిత్ షా జిల్లా పర్యటన బీజేపీ శ్రేణుల్లో జోష్ నింపింది. జిల్లా కేంద్రంలో పసుపు బోర్డు జాతీయ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు వచ్చిన ఆయన అటు పార్టీ శ్రేణుల్లో, ఇటు రైతుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఇచ్చిన హామీ నెరవేర్చడంలో తమ పార్టీ వెనకడుగు వేయదని, ఎన్నిక ఏదైనా సత్తావాటుతామని పార్టీ శ్రేణులు అంటున్నాయి.



- అగ్రనేత అమిత్‌షా పర్యటన విజయవంతంతో బీజేపీ శ్రేణుల్లో సంతోషం
- స్థానిక ఎన్నికల్లో కలిసొస్తుందని ఆశాభావం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా ఇందూరు పర్యటన విజయవంతం కావడంతో ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. ఎన్నికల బరిలో నిలిచిన సమయంలో బాండ్‌పేపర్ రాసిచ్చి మరీ హామీ ఇచ్చిన ధర్మపురి అర్వింద్ అనుకున్నది సాధించడంతో పాటు గత ఎన్నికలకు ముందు ప్రధాని మోదీతో ప్రకటన చేయించారు. మరోవైపు ఇందూరులోనే పసుపు బోర్డు ఏర్పాటు చేయిస్తామని అమిత్‌షాతో సైతం ప్రకటన చేయించారు. ఇచ్చిన హామీ మేరకు పసుపు బోర్డు ఏర్పాటు చేయడంతోపాటు కార్యాలయ ప్రారంభోత్సవానికి అమిత్‌షా రావడంతో శ్రేణుల్లో తిరుగులేని ఉత్సాహం నెలకొంది. పసుపు రైతుల నుంచి సైతం మంచి మద్దతు వస్తుండడంతో పార్టీ నాయకులు మంచి జోష్‌మీదున్నారు. మూడు దశాబ్దాలకు పైగా రైతులు చేస్తున్న పోరాటానికి సముచిత గౌరవం దక్కిందని చర్చ నడుస్తుండడంతో ఇది తమకు మంచి బూస్టింగ్ ఇచ్చినట్లేనని నాయకులు, కార్యకర్తలు చెబుతున్నారు. దేశంలో పసుపు పంటకు రాజధానిగా ఇందూరు ఉండనుందని అమిత్‌షా చేసిన ప్రకటన ఈ ప్రాంత వాసుల సెంటిమెంట్‌కు తిరుగులేని గౌరవం దక్కినట్లేనని సంఘ్ పరివార్ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. శుభప్రదమైన పసుపునకు సంబంధించిన బోర్డు దక్కడంతోపాటు రానున్న ఐదేళ్లలో ఒక బిలియన్ డాలర్ల మేర ఎగుమతులు చేస్తామని అమిత్ షా చేసిన ప్రకటన ఈ ప్రాంతంలో ఎకానమీ పెరిగేందుకు దోహదం చేస్తుందని తద్వారా కేంద్ర ప్రభుత్వంపై మరింత సానుకూల ధోరణి పెరిగినట్లేనని సంఘ్ శ్రేణులు సంతోషం వెలిబుచ్చుతున్నాయి.

అర్వింద్‌కు అధ్యక్ష పదవి చాన్స్ మిస్ కావడంతో..

పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి రేసులో ముందునుంచి దూసుకుపోయిన అర్వింద్‌కు చివరి అడుగు వద్ద మిస్ కావడంతో కార్యకర్తలు కొంతమేర నిరాశకు గురయ్యారు. ప్రస్తుతం యువత పార్టీకి అనుకూలంగా ఉన్న సమయంలో యువనాయకుడిగా, రెండుసార్లు ఎంపీగా గెలుపొందిన అర్వింద్‌కు అధ్యక్ష పీఠం దక్కి ఉంటే ఉత్తర తెలంగాణ మొత్తం ఊడ్చిపారేసేవాళ్లమని పార్టీ కార్యకర్తలు చెబుతున్నారు. అయినప్పటికీ భవిష్యత్‌లో పార్టీని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో వచ్చే స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతామని శ్రేణులు చెబుతున్నాయి.

ఇక తిరుగులేదు..

గతంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో బీజేపీ అగ్రనేతల పర్యటన నేపథ్యంలో బాగా కలిసొచ్చిందని చెబుతున్న పార్టీ శ్రేణులు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కలిసొస్తుందని అంటున్నాయి. గతంలో సాధారణ ఎన్నికల్లో ఓటింగ్ పడేదని, ఇప్పుడు మాత్రం గ్రామ స్థాయిలో రైతుల్లోనూ పార్టీకి ఆదరణ పెరిగిందని.. దీంతో పంచాయతీ, పరిషత్, పురపాలక సంస్థల ఎన్నికల్లో బాగా కలిసొస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. నిజామాబాద్ నగరపాలక సంస్థ ఎన్నికలు జరిగితే గెలుపు తథ్యమని ఇటీవల నిర్వహించిన సర్వేల్లో తేలిందని, ఇప్పుడు అగ్రనేత పర్యటనతో ఇక తిరుగుండదని కార్యకర్తలు చెబుతున్నారు. ప్రజాపరిషత్ ఎన్నికల్లో సైతం గణనీయంగా విజయాలు సొంతం చేసుకోవాలని ఎంపీ అర్వింద్ శ్రేణులను ఇప్పటికే ఆ దిశగా సమాయత్తం చేస్తున్నారు. ముఖ్యంగా 20 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న యువత పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. దీంతో ఇది తమకు బాగా మేలు చేస్తోందని ఎంపీ, ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. మరోవైపు రైతుల నుంచి సైతం మద్దతు గణనీయంగా పెరగడంతో స్థానిక సంస్థల్లో జిల్లాలో ఊహించినదానికంటే ఎక్కువ విజయాలు సొంతమవుతాయని భావిస్తున్నారు.

డీఎస్ ఆత్మ క్షోభిస్తుంది

- బీజేపీ రంగుపూసే ప్రయత్నం
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ విమర్శ



డీఎస్ విగ్రహం వద్ద ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, డీసీసీ అధ్యక్షుడు మానాల తదితరులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పీసీసీ మాజీ చీఫ్ ధర్మపురి శ్రీనివాస్ సేవలు మరువలేనివని, ఆయన గొప్ప రాజనీతిజ్ఞుడని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. డీఎస్ విగ్రహాన్ని కేంద్ర మంత్రి అమిత్‌షా ఆవిష్కరించడంతో ఆయన ఆత్మక్షోభిస్తుందన్నారు. నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తాలో డీఎస్ విగ్రహానికి షబ్బీర్ సోమవారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీఎస్ కాంగ్రెస్‌లో పుట్టి కాంగ్రెస్‌లోనే కన్నుమూశారన్నారు. అమిత్‌షాతో విగ్రహాన్ని ఆవిష్కరింపజేసి ఆయన ఆత్మను క్షోభ పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్‌కు బీజేపీ రంగు పూసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించా రు. బీజేపీయేతర రాష్ట్రాలపై అవినీతి ఆరోపణలు చేయడం అమిత్‌షాకు అలవాటుగా మారిందన్నారు. రాజకీయ ఆరోపణలు చేయడం తప్ప తెలంగాణకు బీజేపీ చేసిందేమీలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సాంకేతిక సమస్యలు ఉన్నాయని 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలకు వెళ్తామన్నారు.

అంచెలంచెలుగా ఎదిగిన నాయకుడు..



మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

డీఎస్ యూత్ కాంగ్రెస్ నాయకుడిగా పనిచేసి పార్టీలో అంచెలంచెలుగా ఎదిగారని మాజీమంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డితో కలిసి డీఎస్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం సుదర్శన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. డీఎస్ జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, ఆయన సేవలు మరువలేనివని అన్నారు. డీఎస్ అంత్యక్రియలకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరై ఆయన పార్థివదేహంపై కాంగ్రెస్ జెండా కప్పారని గుర్తు చేశారు. డీఎస్ విగ్రహ ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని అనుమతులు ఇచ్చిందన్నారు. డీఎస్ సేవలను ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటామని ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు.

డీఎస్ విగ్రహానికి నివాళులర్పించిన వారిలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, సహకార కార్పొరేషన్ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నరాల రత్నాకర్, శరత్, ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొలసాని శ్రీనివాస్, డీసీసీ డెలిగేట్ ధర్మగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

నిజామాబాద్‌నాగారం: నిబంధనలను పాటించని స్కానింగ్ సెంటర్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ అన్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం జిల్లాస్థాయి సలహా కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. చట్టాన్ని అతిక్రమించి లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించే, రిజిస్టర్లు, రికార్డులు మెయింటెయిన్ చేయని స్కానింగ్ సెంటర్లను చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో కొత్తగా ఐదు స్కానింగ్ కేంద్రాలకు అనుమతి, మూడు సెంటర్లకు రెన్యువల్, రెండు స్కానింగ్ కేంద్రాల మూసివేతకు సలహాసంఘం చర్చించి ఆమోదించింది. సభ్యులు శ్వేత, ఇందు, హరిప్రియ, దీప్తి, తుకారాంరాథోడ్, నాగలక్ష్మి, వేణుగోపాల్, స్వామిసులోచన, పద్మాసింగ్, హేమలత, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల దీనస్థితి

- అందని 'చేయూత'
- రెండేళ్లుగా మంజూరుకాని కొత్త పింఛన్లు
- జిల్లాలో ఎదురుచూస్తున్న ఎందరో వికలాంగులు

డొంకేశ్వర్(ఆర్మూర్): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో ఒక్కరికి కూడా (చేయూత) కొత్త పింఛన్ మంజూరు చేయలేదు. ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా పింఛన్లు రాకపోవడంతో ఎంతో మంది దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు. వైద్యానికి, మందులకు డబ్బులు లేక దివ్యాంగులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వ సాయం కోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. కలెక్టర్ సారూ... నాకు పింఛన్ ఇప్పించండి అంటూ ప్రతి సోమవారం దివ్యాంగులు కలెక్టర్ కార్యాలయానికి వస్తూనే ఉన్నారు. ప్రజాపాలనతోపాటు మీ సేవ కేంద్రాలు, ఎంపీడీవో కార్యాలయాల్లో వందల సంఖ్యలో దరఖాస్తులు పడి ఉంటున్నాయి.

వెబ్‌సైట్ నిలిపివేత

మండల స్థాయిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్‌లో జిల్లా కార్యాలయానికి, జిల్లా కార్యాలయం నుంచి రాష్ట్ర శాఖకు పంపాల్సి ఉంటుంది. అయితే పింఛన్లకు సంబంధించిన వెబ్‌సైట్ గత రెండేళ్లలో ఇంత వరకు తెరుచుకోలేదు. దీంతో కొత్త వారికి పింఛన్ల మంజూరు నిలిచిపోయింది. ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయనేది కూడా తెలియని పరిస్థితి నెలకొంది. కనీసం దివ్యాంగులకు ప్రత్యేక కేటగిరిలో పింఛన్లు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్న వారు కోరుతున్నారు. దీనిపై జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్‌ను వివరణ కోరగా... ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు.



■ ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు వేముల నాగేశ్. ఇతనిది డొంకేశ్వర్ మండలం చిన్నయానం. నాగేశ్ ఆరేళ్ల క్రితం పక్షవాతం బారినపడి నడవలేని స్థితిలో ఉన్నాడు. పేద కుటుంబ కావడంతో వైద్యం చేయించుకోవడానికి డబ్బులు లేవు. భార్య లక్ష్మి బీడీలు చుడుతూ ఇద్దరు ఆడపిల్లలను పోషిస్తోంది. దివ్యాంగుల పింఛన్ వస్తే భర్తకు మందులు కొనొచ్చని సదరం సర్టిఫికెట్ పెట్టి ఇప్పటికి ఐదు సార్లు అధికారులకు దరఖాస్తు చేసింది. రెండేళ్లు గడుస్తున్నా ఇంతవరకు ప్రభుత్వం నుంచి పింఛన్ మంజూరు కాలేదు. సదరం సర్టిఫికెట్ గడువు తేదీ కూడా ముగిసింది. ఈ పరిస్థితి ఒక్క నాగేశ్‌దే కాదు. ఈ పరిస్థితి జిల్లాలో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న మానసిక, శారీరక వికలాంగులందరిది.

డ్రాపౌట్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలి

- విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ టి వినయ్‌కృష్ణారెడ్డి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, పాల్గొన్న అదనపు కలెక్టర్ అంకిత్

నిజామాబాద్‌అర్బన్: డ్రాపౌట్‌లు ఎక్కువగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి విద్యాశాఖ అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగేలా చొరవ చూపాలన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం ఎంఈవోలతో కలెక్టర్ సమీక్షాసమావేశం నిర్వహించారు. జూన్ 6 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించిన బడిబాటలో నమోదైన ప్రవేశాల వివరాలను మండలాల వారీగా తెలుసుకున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాల మెరుగుదలకు చేపట్టిన మరమ్మతు పనులను వేగంగా పూర్తి చేయించాలని, నిధులు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. పాఠశాలల్లో అవసరమైన చోట కిచెన్ షెడ్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలన్నారు. పదో తరగతి పాసైన ప్రతి విద్యార్థి కళాశాలల్లో చేరేలా పర్యవేక్షించాలని, పై చదువుకు వెళ్లని వారిని గుర్తించి పూర్తి వివరాలు సేకరించాలని ఆదేశించారు. ఇప్పటికే అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ పూర్తయ్యిందని, నోట్‌పుస్తకాలు సైతం 80 శాతం పూర్తయినట్లు వివరించారు. మిగతా నోట్ పుస్తకాలు విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే ఒక జత యూనిఫామ్ ఇప్పటికే విద్యార్థులకు అందించామని, రెండో జత యూనిఫామ్ మహిళా స్వయం సహాయక సంఘాలు త్వరగా కుట్టించి ఇచ్చేలా కృషి చేయాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, డీఈవో అశోక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కంజర జెడ్పీహెచ్‌ఎస్ తనిఖీ



పాఠశాల రికార్డులను తనిఖీ చేస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కంజర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈవో అశోక్‌తో కలిసి కలెక్టర్ వినయకృష్ణారెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హెచ్‌ఎంతో మాట్లాడి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనుల వివరాలు తెలుసుకున్నారు. రూ.11.20లక్షలు మంజూరు కాగా తాగునీటి వసతి, విద్యుత్, ఫ్లోరింగ్, తదితర ప్రతిపాదిత పనులన్నీ పూర్తయ్యాయని హెచ్‌ఎం గోపాలచారి తెలిపారు. అనంతరం పాఠశాల రికార్డులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్నభోజనం అందించాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఇంకా ఏమైనా వసతులు అవసరమైతే ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్ హెచ్‌ఎంకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో రాములు, ఉపాధ్యాయులు ఉన్నారు.

బెదిరింపులకు వెరవలేదు

- నాన్నతోపాటు కుటుంబ సభ్యులు ధైర్యాన్నిచ్చారు
- పదవీ విరమణ కార్యక్రమంలో జిల్లా అదనపు జడ్జి కనకదుర్గ



న్యాయమూర్తి కనకదుర్గను సన్మానిస్తున్న జిల్లా జడ్జి జీవీఎన్ భరతలక్ష్మి, బార్ అసోసియేషన్ సభ్యులు

నిజామాబాద్ లీగల్: విధి నిర్వహణలో తనను చంపుతామని బెదిరింపులు వచ్చినా ఏనాడూ వెరవలేదని, అన్ని పరిస్థితులను తట్టుకుని నిలబడ్డానని పదవీ విరమణ చేసిన జిల్లా అదనపు జడ్జి కనకదుర్గ అన్నారు. ఆడ పిల్లలకు చదువు ఎంతో ముఖ్యమని తనను కుటుంబ సభ్యులు చదివించారని, తన తండ్రి ధైర్యంచెబుతూ ముందుకు నడిపించారన్నారు. నిజామాబాద్ మొదటి అదనపు జిల్లా జడ్జి కనకదుర్గ పదవీ విరమణ సందర్భంగా నిజామాబాద్ బార్ అసోసియేషన్ జిల్లా కోర్టు ప్రాంగణంలోని సమావేశపు హాలులో సోమవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా జడ్జి భరతలక్ష్మి హాజరై బార్ అసోసియేషన్ సభ్యులతో కలిసి న్యాయమూర్తి కనకదుర్గను సన్మానించారు. జిల్లా కోర్టులో అన్నీతానై పెద్దదిక్కుగా నిలిచిన జడ్జి కనకదుర్గ అందరికీ ఆదర్శప్రాయురాలని ప్రధాన న్యాయమూర్తి జీవీఎన్ భరతలక్ష్మి కొనియాడారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిళ్ల సాయారెడ్డి, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు మంథని రాజేందర్‌రెడ్డి, అదనపు జిల్లా జడ్జీలు శ్రీనివాస్, ఆశాలత, హరీష, జూనియర్ సివిల్ జడ్జి హరికుమార్, బార్ ఉపాధ్యక్షుడు దిలీప్, సంయుక్త కార్యదర్శి ఝాన్సీరాణి, కోశాధికారి నారాయణదాసు, లైబ్రరీ కార్యదర్శి శ్రీమాన్, పీపీ మాదస్తు రాజారెడ్డి, ప్రభుత్వ న్యాయవాది సుదర్శన్ పాల్గొన్నారు.

వైఎస్సార్ స్ఫూర్తితోనే ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థికసాయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవీపేట: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఆలోచనలతోనే పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆసరాగా నిలవాలని ప్రత్యేక పథకానికి శ్రీకారం చుట్టినట్లు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను సోమవారం నవీపేట మండల పరిషత్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూతుళ్ల పెళ్లిళ్లకు తల్లిదండ్రులు ఇబ్బంది పడకూడదనే ఆలోచనతో గతంలో రూ.25 వేలను అందించారన్నారు. అదే ఆలోచనతో ప్రస్తుతం రూ.లక్షను అందజేస్తున్నామన్నారు. సంక్షేమ పథకాల అమలు పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.వేల కోట్లు అప్పులు చేసి వడ్డీ కూడా కట్టలేదని ఎద్దేవా చేశారు. తల్లిదండ్రులు పిల్లలను సర్కార్ బడులల్లో చేర్పించాలని సూచించారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మండల నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రాజేంద్రకుమార్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, సాయారెడ్డి, భగవాన్, గోపాల్, మూస పాల్గొన్నారు.

తెయూ హాస్టల్ భోజనంలో పురుగు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ మెయిన్ క్యాంపస్‌లోని న్యూ బాయ్స్ హాస్టల్‌లో సోమవారం రాత్రి భోజనంలో పురుగు వచ్చిందని విద్యార్థులు పేర్కొన్నారు. ఈ విషయమై హాస్టల్ వార్డెన్, సిబ్బందికి తెలిపినా పట్టించుకోలేదని ఆరోపించారు. హాస్టల్స్ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు వీసీ, రిజిస్ట్రార్ లు సందర్శించలేదని విమర్శించారు. వర్సిటీ ఉన్నతాధికారులు స్పందించి నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. విద్యార్థులు భోజనంలో పురుగు వచ్చిన వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసి నిరసన తెలిపారు.

ప్రజావాణి అర్జీలను పరిష్కరించాలి

- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 127 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, డీఆర్డీవో సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, మెప్మా పీడీ రాజేందర్‌కు అర్జీలను సమర్పించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ అర్జీదారులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

ప్రభుత్వ టీచర్లు అంకితభావంతో పనిచేయాలి

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ బడుల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, వారు అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ నాణ్యమైన విద్యను బోధిస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. నగరంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సోమవారం పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించి, టాపర్లుగా నిలిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులను ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సన్మానించారు. అలాగే వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పల్లికొండ, డొంకేశ్వర్, రాంపూర్, మెండోరా, అమ్రాద్, చౌట్‌పల్లి, జక్రాన్‌పల్లి, మోస్రా, కల్లెడి, రెంజల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కూడా సత్కరించారు. ప్రభుత్వ బడుల్లో అత్యధికంగా విద్యార్థులను చేర్పించిన బోర్గం(పి) హైస్కూల్, బోధన్ రాకాసిపేట్ బాలికల ఉన్నత పాఠశాల, చిట్టాపూర్ ప్రైమరీ స్కూల్, తుంపల్లి ప్రైమరీ స్కూల్, ఫులాంగ్ బాలుర ఉన్నత ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలను సత్కరించారు. సోమవారం పదవీ విరమణ చేసిన ముగ్గురు ఎంఈవోలు, ముగ్గురు హెచ్ఎంలను సన్మానించి వీడ్కోలు తెలిపారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ, రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, అదనపు కలెక్టర్ అంకిత్, డీఈవో అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్సెస్సీ టాపర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



ఖలీల్‌వాడి: అర్జీదారుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని సీపీ సాయిచైతన్య సంబంధిత అధికారులకు సూచించారు. నగరంలోని సీపీ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 28 ఫిర్యాదులను సీపీ స్వీకరించారు. వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత ఎస్సైలు, సీఐలకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని పరిష్కారానికి సూచనలు చేశారు.

రెండే గదుల్లో నాలుగు తరగతులా..?

నిజామాబాద్ లీగల్: ఒకటి నుంచి నాలుగో తరగతి వరకు రెండే తరగతి గదుల్లోనే పాఠశాల నిర్వహిస్తున్నారా అని సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్ భాస్కర్ రావు ఉపాధ్యాయులను ప్రశ్నించారు. సోమవారం నగరంలోని ధర్మపురిహిల్స్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాలను జడ్జి తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో ఖాళీ బీరు బాటిల్స్, పాన్ పరాగ్ లాంటి వస్తువులు ఉండటం గమనించారు. రాత్రి వేళల్లో అసాంఘిక శక్తులకు పాఠశాల అడ్డాగా మారకుండా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. రాత్రి వేళ పోలీసులు పెట్రోలింగ్ చేసేలా ఆదేశాలు జారీ చేస్తామని, హెచ్ఎం పోలీసులకు ఫిర్యాదు చేయాలని జడ్జి సూచించారు.



క్రైం కార్నర్

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి



బోధన్‌రూరల్: మండలంలోని బండార్‌పల్లికి చెందిన సాయికుమార్(28) చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు వల చుట్టుకుని నీటి మునిగి మృతిచెందినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి సోమవారం తెలిపారు. మృతుడి భార్య అనురాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

అర్గుల్‌లో ఒకరి అదృశ్యం



జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్‌లో నివాసముంటున్న లింగంపేట గ్రామానికి చెందిన కొరబోయిన అశోక్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై మాలిక్ రహమాన్ తెలిపారు. ఈ నెల 28న రాత్రి 9 గంటలకు జక్రాన్‌పల్లిలోని తన స్నేహితుడిని కలిసి వస్తానని చెప్పి బైక్‌పై వెళ్లిన అతను తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. అశోక్ తండ్రి ప్రభురాజ్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నీవు లేని జీవితం నాకొద్దని..

- భార్య మృతి తట్టుకోలేక భర్త ఆత్మహత్య

వర్ని: ప్రేమతో వారిద్దరి మనసులు కలిశాయి. వివాహ బంధంతో ఒక్కటయ్యారు. జీవితాంతం ఒకరికొకరు కష్టసుఖాల్లో తోడునీడగా ఉండాలని భావించారు. కానీ విధి ఆడిన వింత నాటకంలో భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆమె మృతుని తట్టుకోలేని భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన వర్ని మండలం వడ్డేపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. రుద్రూర్ మండలం అంబం గ్రామానికి చెందిన ఎరుకల పోశెట్టి(25) వడ్డేపల్లిలో ఉండే తన బంధువుల ఇంట్లో చిన్న నాటి నుంచి ఉంటున్నాడు. అదే గ్రామానికి చెందిన అనితను ఆరు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరి జీవితం సాఫీగా సాగుతుందనుకుంటున్న సమయంలో ఇటీవల ఆమె అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె మృతిని తట్టుకోలేని పోశెట్టి తన ఇంటి సమీపంలోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.



పోశెట్టి (ఫైల్)

పోచంపాడ్‌లో పిచ్చికుక్కల స్వైర విహారం

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లో సోమవారం ఉదయం పిచ్చి కుక్కలు స్వైర విహారం చేశాయి. గ్రామంలో వీధుల గుండా కనిపించిన వారిపై దాడి చేశాయి. దీంతో ముగ్గురుకి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన రజిత చేతిపై, విఠల్, విష్ణులకు కంటి, కాలి భాగాలపై దాడి చేసి గాయపర్చాయి. వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. పోచంపాడ్‌లో వీధి కుక్కలు ఎక్కువ కావడంతో కనిపిస్తే కరుస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డీఎస్ విగ్రహావిష్కరణలో దొంగల చేతివాటం

నిజామాబాద్ రూరల్: కంఠేశ్వర్ బైపాస్ సిగ్నల్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన డీఎస్ విగ్రహావిష్కరణలో కేంద్ర మంత్రి అమిత్‌షా చేతుల మీదుగా జరిగిన విషయం తెలిసిందే. ఈ ఆవిష్కరణలో మారుతినగర్‌కు చెందిన ప్రభుత్వ ఉద్యోగి కాసుల రఘు, అలాగే బాశెట్టి గంగాధర్‌కు చెందిన బంగారు గొలుసులను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరిఫ్ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అంతర్‌జిల్లా దొంగల ముఠా రిమాండ్

- 12 తులాల బంగారం, బైక్ స్వాధీనం



వేములవాడ: వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా దొంగల ముఠాను రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ పోలీసులు సోమవారం తెలిపారు. వేములవాడ టౌన్ పీఎస్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మహేశ్ బీ గీతే వివరాలు వెల్లడించారు. జగిత్యాల జిల్లాకు చెందిన బోదాసు మహేశ్ నిజామాబాద్ జిల్లాకు చెందిన గద్దల స్వప్న, విశాల్‌సింగ్, జగిత్యాల జిల్లాకు చెందిన నేరెళ్ల శ్రీనివాస్, నేరెళ్ల రాణి, గోత్రాల బాలమణి ముఠాగా ఏర్పడి ఆర్మూర్, నిజామాబాద్, వేములవాడ, కోనరావుపేట, బోయినపల్లి ప్రాంతాల్లో గత రెండు నెలలుగా దొంగతనాలకు పాల్పడ్డారు. టెక్నాలజీ సాయంతో వీరు వేములవాడ సమీపంలో తిప్పాపూర్ బస్టాండ్ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 12 తులాల బంగారం, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. దొంగలను పట్టుకున్న వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్, ఎస్సైలు అనిల్‌కుమార్, వెంకట్రాజం, సిబ్బంది గోపాల్, పంతులు, లత, సాహెబ్ హుస్సేన్, దేవేందర్, సమియుద్దీన్‌ను అభినందించారు.

నలుగురు కానిస్టేబుళ్లకు పదోన్నతి



ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నలుగురు కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లలుగా పదోన్నతి పొందారు. పదోన్నతి పొందిన కానిస్టేబుళ్లు ఎండీ తయ్యబ్ అలీ(మోర్తాడ్), ఈ ఈశ్వర్(ఇందల్వాయి), పి రాకేశ్(నిజామాబాదు రూరల్), ఎస్ వెంకట్ రామ్(సీసీఎస్, నిజామాబాద్) సీపీ సాయిచైతన్యను సోమవారం సీపీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం సీపీ సిబ్బందిని అభినందించారు.